30 ఏళ్లయినా పక్కా భవనమేదీ?

- పీహెచ్‌సీ భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం
- మహిళా అధికారులకు ఇబ్బందులు
- ఇరుకైన రిజిస్ట్రేషన్ కార్యాలయం
- ఉద్యోగులు, రైతులకు తప్పని తిప్పలు



ఓదెల తహసీల్దార్ కార్యాలయం

ఓదెల: మండలం ఏర్పడి ముప్పయి ఏళ్లయినా తహసీల్దార్ కార్యాలయం పక్కా భవనానికి నోచు కొలేదు. తహసీల్దార్ కార్యాలయంలో ఏలాంటి సౌకర్యాలు లేకపోవటంతో ఉద్యోగులు, మహిళలు, రైతులు, మండల ప్రజలు నరకయాతన పడుతున్నారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిర్మించిన భవనంలోనే ముప్పయి ఏళ్లుగా తహసీల్ కార్యాలయం నడుస్తోంది. కార్యాలయం ఇరుకుగా ఉండటంతో కేవలం పదిమంది మాత్రమే కూర్చోనే పరిస్థితి ఏర్పడింది. దీంతో కార్యాలయానికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ కూడా తహసీల్దార్లకు అప్పగించటంతో కార్యాలయంలో సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నయాబ్ తహసీల్దార్ కార్యాలయంతో పాటు సిబ్బందికి సరైన గదులు లేక అవస్థలు పడుతున్నారు. రికార్డులకు భద్రపరిచే గదికి భద్రత కరవైంది. మూత్రశాలలు, మరుగుదొడ్డు కూడ సరిగా లేకపోవటంతో మహిళా ఉద్యోగులు నరకయాతన పడుతున్నారు. ఉన్నతాధికారుల సమావేశాలు, సభలు నిర్వహించాలంటే నామ మాత్రంగానే ముగుస్తున్నారు. తహసీల్ కార్యాలయానికి పక్కాభవనానికి స్థలం కేటాయించినప్పటికీ ఇప్పటివరకు నిధులు మంజూరు కావడం లేదు. నిధులకోసం ప్రజాప్రతినిధులు పట్టించువటం లేదనే విమర్శలు వస్తున్నాయి. రెండు సార్లు గెలిచిన స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కార్యాలయంలో నిలబడే జాగలేదు



ఓదెలలో కార్యాలయం ఏర్పడ్డప్పటినుంచి ఇప్పటివరకు పక్కా భవనం నిర్మించలేదు. ప్రస్తుత కార్యాలయంలో నిలబడే జాగలేదు. వర్షా కాలంలో పదరాని బాధలు పడుతున్నాం. తహసీల్దార్ కార్యాలయం ఇరుకుగా ఉండటంతో 22 ఊళ్లే ప్రజలు నానా గోసలు పడుతున్నాం. సర్కార్ పబ్లిక్‌కు సౌలత్‌లు ఏర్పాటు చేయాలి. –మిట్టపల్లి రామస్వామి, రైతు, కొమిర

రిజిస్ట్రేషన్ల కోసం ప్రత్యేక గది ఏర్పాటు చేయాలి



మండల తహసీల్దాల్ కార్యాలయంలో రైతులకు ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ల కార్యాలయం ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఇరుకుగా ఉన్న రూంలో ఏర్పా టు చేయటంతో కాలు పెట్టడానికి సందులేదు. ప్రభుత్వం ప్రత్యేకంగా గదిని నిర్మించాలి. రైతుల ఇబ్బందులను తొలగించాలి. –పిట్టల మొండయ్య రైతు పిట్టలపల్లె

పక్కా భవనానికి ప్రతిపాదనలు పంపించాం



మండలంలో తహసీల్ పక్కాభవనానికి స్థలాన్ని కే టాయించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరైతే అన్ని హంగులతో గదులు ఏర్పా టు అవుతాయి. ప్రస్తుతం అరకొర సౌకర్యాలతో మండల ప్రజలకు సేవలందిస్తున్నాం. ప్రభుత్వం పక్కా భవనానికి నిధులు మంజూరు చేయాలి. –కె రమేశ్ తహసీల్దార్, ఓదెల

క్లుప్తంగా

నిరుపేద మహిళ వైద్యానికి ఆర్థికసాయం



బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద మానుమండ్ల దుర్గమ్మ అనారోగ్యం పాలై ఉమ్మడి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ హాస్పిటల్ చికిత్స పొందగా, బిల్లు చెల్లించే సమయంలో డబ్బులు సరిపోక పోగా, బీఆర్ఎస్ నాయకులు, నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డికి సమాచారం అందించారు. దీంతో స్పందించిన మనోహర్‌రెడ్డి హాస్పిటల్ వెళ్లి బాధితురాలిని పరామర్శించి, రూ.16 వేలు ఆస్పత్రి బిల్లు చెలించారు. అడిగిన వెంటనే సాయం అందించిన మనోహర్‌రెడ్డికి కుల సంఘం నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, బెజ్జంకి సంతోశ్, హనుమయ్య, అంబేడ్కర్ సంఘం నాయకులు తేజరాజ్, సంపత్, రాజు, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

బట్ట సంచులు పంపిణీ



బట్టసంచులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఓదెల: ప్లాస్టిక్ నివారణలో భాగంగా అందరికీ అందుబాటులో బట్టసంచులను పంపిణీ చేయడానికి కేసీఆర్ సేవాదళం శ్రీకారం చుట్టింది.. ఓదెల మండలం కనగర్తి మార్కెట్లో వినియోగదారులకు కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో బట్ట సంచులను ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గంలో రెండు లక్షల బట్ట సంచులను పంపిణీ చేసినట్లు కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని గామాల మార్కెట్లో బట్టసంచుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి చాతాల్ల కాంతయ్య, జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి బొద్దుల సాయినాథ్, నాయకులు రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మోసపూరిత పాలనను తరిమికొట్టాలి

గోదావరిఖని: బీఆర్ఎస్ పార్టీ మోసపూరిత పాలనను తరిమికొట్టాలని దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ తెలిపారు. ఆదివారం సీఎస్పీ కాలనీలో ఏర్పాటు చేసిన శక్తికేంద్రం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. మరోసారి మోసం చేయడానికి దళి తుల ఓటు బ్యాంకు కోసం వస్తున్నారని, ప్ర జలు నమ్మవద్దన్నారు. కార్పొరేషన్ ఇంచార్జి లక్ష్మణ్‌యాదవ్, కొమురవెల్లి విశ్వనాథ్, క్యాతం వెంకటరమణ,రాజలింగు,నర్సయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి



మేయర్‌తో మానవ హక్కుల వేదిక సభ్యులు

గోదావరిఖనిటౌన్: విధి నిర్వహణలో ఇటీవల విద్యుత్ ఘాతంతో మృతి చెందిన మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడు అయిల్ల రమేశ్ కుటుంబానికి న్యాయం చేయాలని ఉమ్మడి జిల్లా మానవ హక్కుల వేదిక నిజ నిర్ధారణ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేశ్ అన్నారు. ఆదివారం నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు రమేశ్ కుటుంబాన్ని పరామర్శించి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించి విద్యుత్ శాఖ నిర్లక్ష్య ధోరణికి సందీప్ ప్రాణం పోయిందని, పరిహారం కేవలం రూ.5 లక్షలు ప్రకటించి పూర్తి స్థాయిలో బాధితులను తప్పుదారి పట్టించే విధంగా ఉందన్నారు. విద్యుత్‌శాఖ వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రామగుండం మేయర్ బంగి అనిల్ కుమార్‌ను కలిసి విషయాన్ని నివేదించి మృతుడి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. సందీప్ మృతికి కారణమైన విద్యుత్ శాఖ సిబ్బందిపై వెంటనే శాఖా పరమైన చర్యలు చేపట్టి కేసు నమోదు చేయాలనిమానవ హక్కుల వేదిక డిమాండ్ చేస్తుందన్నారు. మృతుడి కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.5 లక్షలు, విద్యుత్ శాఖలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం, నష్టపరిహారం కింద రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మధు, సభ్యులు అజయ్, కిషోర్,రంజిత్, అచ్యుత్, రాజన్న,అరికిల్ల దేవేందర్, మార్వాడి సుదర్శన్, మల్లన్న, దుర్గం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

శ్రీత్రయంబకేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న జీఎంలు

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ3, ఏపీఏ పరిధి ఎస్‌అండ్‌పీసీ కార్యాలయం ఆవరణంలోని శ్రీత్రయంబకేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా విశిష్ట పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు రాంపల్లి పవన్ శర్మ మంత్రోచ్ఛారణల మధ్య ఆర్జీ 3 జీఎం తన్నీరు వెంకటేశ్వర రావు, ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్‌అండ్‌పీసీ (సెక్యూరిటీ సిబ్బంది) ఆధ్వర్యంలో నిర్వహించిన మహాప్రసాద వితరణ(అన్నదాన) కార్యక్రమంలో పాల్గొని భోజనాలు చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ శంకరయ్య, ఏరియా ఇంజనీర్ సీతారామం, ప్రాజెక్ట్ అధికారి మత్స్యగిరి నరేందర్, ఆలయ కమిటీ సభ్యులు, ఇతర అధికారులు, ఉద్యోగులు, నాయకులు, సెక్యూరిటీ సిబ్బంది, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

శ్రీభూదేవి సహిత బొడ్రాయి శ్రీమహాలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠ

రామగిరి: మండలంలోని పన్నూరులో ఈనెల 23న శ్రీ భూదేవి సహిత బొడ్రాయి,శ్రీమహాలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠ, పోచమ్మ కొలుపు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠలో బాగంగా ఈనెల 22న రక్షాబంధనం, కలష గణపతి, నవగ్రహ పూజ, జలధి పంచామృత అభిషేకం, అగ్ని ప్రతిష్ఠ, పుష్పాభిషేకం నిర్వహించనున్నారు. ఈనెల 23న విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణహుతి, ఆశీర్వచనం, ఈనెల 24న భోనాలు, మధ్యాహ్నం అన్నదానం , ఈనెల 25న అమ్మవార్ల, స్వామివార్ల పోచమ్మ కొలుపు. ఈనెల 26న గావు పట్టడం(బలి)జరుగుతుందని వారు పేర్కొన్నారు.

కనుల పండువగా మల్లన్న పట్నాలు



రావుల మల్లికార్జున స్వామి కల్యాణోత్సవంలో వేసిన పట్నం

జూలపల్లి: మండల కేంద్రంలో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రావుల మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాలు ఆదివారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి ఆలయం ముందు ఒగ్గు పూజారులు లగ్నం పట్నం వేయగా, భక్తులు మొక్కులు చెలించారు. ఉత్సవాల్లో యాదవ సంఘం అధ్యక్షుడు ఆవుల ఐలయ్య, మల్లెత్తుల కనుకయ్య, దారవేని పోచాలు, ఐలయ్య, మల్లేశం, సురేందర్, నర్సయ్య, మాజీ సర్పంచ్ పోట్టాల మల్లేశం, ఒగ్గు మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



బసంత్‌నగర్‌లో శివాజీ జయంతి వేడుకల్లో ప్రజలు



మంథనిలో శివాజీ విగ్రహం ఆవిష్కరణ

పాలకుర్తి:మండలంలోని బసంత్‌నగర్‌లో శ్రీ ఛత్రపతి శివాజీ వేడుకలను స్థానిక యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బసంత్ నగర్ రాంమందిర్ సమీపంలోని ప్రధాన కూడలి వద్ద శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి జైశ్రీరాం నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్టికోల వేణుగోపాలరావు, ఛత్రపతి యూత్ సభ్యులు శ్రీరామోజు ప్రసాద్, కన్నం వెంకటేశ్, అట్ల శ్రీనివాస్, ఆవుల రంజిత్, దారం తిరుపతిరెడ్డి, మనోజ్, తువ్వ శ్రీకాంత్, ఆడెపు సుందర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ ఆశయసాధనకు కృషి చేయాలి

సుల్తానాబాద్: ఛత్రపతి శివాజీ ఆశయ సాధనకు ప్రతి యువకుడు పని చేయాలని బీజేపీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్ రావు అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ పట్టణంలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పూసాల రోడ్డులో శివాజీ చౌరస్తా (పూసాలరోడ్డు) శివాజీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు అందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలోఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు ఎనగందులసతీష్,కూకట్ల నాగరాజు, ఓదెల జెడ్పీటీసీ గంట రాములు బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ ఆశయాలను కొనసాగించాలి

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్‌లో శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జూలపల్లిలో సర్పంచ్ దారబోయిన నర్సింహయాదవ్,ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్ ఛత్రపతి శివాజీ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెద్దాపూర్‌లో యూత్ నాయకుడు కంకణాల జ్యోతిబసు మాట్లాడుతూ మొగలుల సామ్రాజ్యం నుండి మరాఠా ప్రజలకు విముక్తి కల్పించిన మహయోధుడని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేశ్,వార్డు సభ్యుడు సంపత్, ఉత్సవ కమిటీ సభ్యులు కనకశేఖర్, తీగెల అశోక్‌గౌడ్, సీపెల్లి అంజయ్య, తొగరు శ్రీనివాస్, వెంకటయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్:మండలంలోని ఆరెపల్లెలో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శివాజీ దేశ భక్తిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవేందర్ రావు, ఎంపీటీసీ సదానందం, వైస్ ఎంపీపీ శిరీష, ఆరెకుల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చందర్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో ఆదివారం సాయంత్రం ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో డీజే సౌండ్‌లతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మంథని: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా మంథని బొక్కలవాగు వంతెనపై నూతనంగా నిర్మించిన శివాజీ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం నుంచి పట్టణ పుర వీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ గడ్డి రమేశ్ పాల్గొన్నారు.

పెద్దపల్లిలో ఛత్రపతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని వ్యవస్థాపక అధ్యక్షుడు శివంగారి సతీశ్ అన్నారు. స్థానిక సిరిఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. శివాజీ ఆశయసాధనకు పాటు పడతామన్నారు. పెద్దపల్లిలో విగ్రహా ఏర్పాటుకు సహకారం అందించాలని కలెక్టర్‌ను కలిసి వివరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వంశీరాజ్, రాజేశ్, రాధస్వామి, శ్రావణ్, హరీశ్, సాగర్, మహేశ్, రాజంమహంత, తిరుమల్‌రావు, మంథెన కృష్ణ, అఖిల్,కౌశిక్ తదితరులున్నారు.

యువత చేతుల్లో దేశ భవిష్యత్

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



విజేత టీంకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. ఆదివారం క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగడం అభినందనీయమన్నారు. యువత దుర్వ్యసనాలకు బానిస కాకుండా సమాజానికి మార్గదర్శకులుగా, స్ఫూర్తిగా నిలవాలన్నారు. గత 8 ఏళ్లుగా ప్రతి ఏటా టోర్నీ నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. తాను తిలక్‌నగర్ నుంచే ప్రజల అభీష్టం మేరకు ఎమ్మెల్యేగా గెలిచానని, యువతకు ప్రయోజనం చేకూరేలా చేపట్టే విషయాల్లో ముందుంటానన్నారు. ఈ టోర్నీలో 32 టీంలు పాల్గొనగా విన్నర్‌గా నిలిచిన ఉస్మాన్ లెవెన్ జట్టు, రన్నర్స్‌గా నిలిచిన సజ్జు లెవెన్ జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము వేణు, పూసాల శ్రీధర్, దొమ్మేటి వాసు తదితరులతో పాటు క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలి

ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. ఆదివారం అరెకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలో సమీపంలో చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఏఒక్క వర్గానికి, కులాని, మతానికి పరిమితం కాదని శివాజీ అందరివాడన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాతు శ్రీనివాస్, సంఘం జిల్లా అధ్యక్షుడు సమ్మారావు, మోహన్‌రావు, చంద్రమోహన్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు మానుకోవాలి



మాట్లాడుతున్న ఐలి శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ: తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘంపై జాతీయ సంఘాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలు వెంటనే మానుకోవాలని టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆర్జీ–2 ఏరియాలో సర్ఫేస్ జనరల్ మాజ్దూర్ కార్మికులకు సంబంధించిన కన్వెన్షన్ నడుస్తుందన్నారు. దానిలో భాగంగా గత నెల రోజుల క్రితమే కన్వెన్షన్ ఇచ్చారని పేర్కొన్నారు. 100 మందిలో 40 మంది కార్మికులు కొంత కాలంగా రెండు, మూడేళ్ల నుంచి జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న కార్మికులకు డిప్యూటేషన్ రద్దు చేసి తిరిగి అండర్ గ్రౌండ్‌కు కేటాయించారని తెలిపారు. ఈ విషయపై సింగరేణి యాజమాన్యంతో పలుమార్లు మాట్లాడి జనరల్ మజ్దూర్ కార్మికులను ఇలాగే కొనసాగించాలని కోరినట్లు తెలిపారు. వకీల్‌పల్లి గనిలో మిషన్లు నడవడం లేదని మరి కొందరిని కూడా ఓసీపీలోకి తీసుకోనున్నట్లు తెలిపారు. హెచ్ఎం నాయకులు మాట్లాడే పద్ధతి మార్చుకోవాలని టీబీజీకేఎస్ నాయకులపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను మానుకోకపోతూ సరైన సమయంలో సమాధానం ఇస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు చంద్రయ్య, ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



విజేత టీంకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్: సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రంలోనే ప్రతీ ఇంటిలో ఎదో ఒక ప్రభుత్వ సంక్షేమ పథకం అందుతోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ క్రికెట్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్లకు బహుమతులు, నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుల్తానాబాద్ లో నిర్వహించిన మ్యాచ్‌లో విజేతగా 8 వ వార్డు జట్టు, రన్నర్ గా 9 వవార్డు జట్టు గెలుపొందాయి. విజేతలుగా నిలిచిన వారి నైపుణ్యాలను ఓడిపోయిన క్రీడాకారులు గ్రహించాలని, అలాగే గెలిచిన వారి మేలుకోవలను అందిపుచ్చుకోవాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అన్నారు. నిర్వాహకుడు సూర శ్యామ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, మండల పార్టీ అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్ రావు, ఎఎంసీ చైర్‌పర్సన్ బుర్ర మౌనిక, మాజీ ఎంపీపీ ఈట రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి సందీప్ రావు, పట్టణాధ్యక్షుడు పారుపెల్లి గుణపతి,కన్వీనర్ రాజ మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం,పట్టుదల,క్రమశిక్షణతోనే విజయం

జూలపల్లి: గ్రామీణ యువత పట్టుదల,ఆత్మవిశ్వాసం,క్రమశిక్షణతో ఆడితే విజయం తథ్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుమ్మరికుంటలో సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా పదిహేను రోజులుగా నిర్వహిస్తున్న కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు నగదు బహుమతులు, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన వడ్కాపూర్ జట్టుకు రూ.10 వేలు, రన్నర్‌గా నిలిచిన జూలపల్లి జట్టుకు రూ. 5 వేలు అందించారు. క్రీడాకారులకు ప్రభుత్వం నైపుణ్యం పెంచుకునేందుకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, ఎంపీటీసీ మల్లేశం, వైస్ ఎంపీపీ రమేశ్,ఎస్సై వెంకటకృష్ణ, సర్పంచ్ నర్సింహయాదవ్, కొప్పుల మహేశ్, కుంట రాజేశ్వర్‌రెడ్డి, క్రికెట్ జట్లు పాల్గొన్నాయి.

విజేతలకు బహుమతులు అందజేత

ఓదెల: సీఎం క్రికెట్ కప్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు పంపిణీ చేశారు. విన్నర్ ఓదెల జట్టుకు రూ.10వేలు, రన్నర్ పొత్కపల్లి జట్టుకు రూ.5వేలు, కప్ అందించారు. బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా రాంనేని అనిల్, బెస్ట్ బౌలర్‌గా సుమంత్ రాణించారు. జిల్లాకేంద్రంలో నిర్వహించే పోటీల్లో మండలానికో జట్టు చొప్పున పాల్గొనాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంపీపీ కునారపు రేణుకదేవి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచుల ఫోరం మండలశాఖ అధ్యక్షుడు ఆళ్ల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీపై నుంచి పడి కూలీ మృతి



దాన్నా మృతదేహం

గోదావరిఖని: రామగుండం మెడికల్ కళాశాల మొదటి అంతస్తుపై నుంచి పడి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మేషన్ కూలీ డాలు దాన్నా (52) మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్సై సుబ్బారావు కథనం ప్రకారం.. రాడ్ బెండింగ్ పనులు నిర్వహిస్తున్న హన్నా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో ఛాతీ, నడుంభాగంలో బలమైన దెబ్బలు తగిలాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. అదే గ్రామానికి చెందిన తోటి కూలి కర్మఖర్ బబ్లూ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తారకరత్న మృతి సినీ రంగానికి తీరని లోటు

జ్యోతినగర్: నందమూరి తారకరత్న మృతి సినీ రంగానికి తీరని లోటని యువరత్న పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జనగామ తిరుపతి అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండంలో తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులను వెలిగించి నివాళి అర్పించి, సంతాపం వ్యక్తం చేశారు.. సీనియర్ ఎన్టీఆర్ మనవడిగా తారకరత్న సినీ రంగ ప్రవేశం చేశాడని, ఒకటో నెంబర్ కుర్రాడు సినిమాతో సినీ ఇండస్ట్రీకి వచ్చి ఒకే రోజు 9 సినిమాలకు పూజ చేసి సంచలన వరల్డ్ రికార్డ్ సృష్టించారని అన్నారు. కార్యక్రమంలో అభిమానులు భరద్వాజ్, సిద్దార్థ, జయేంద్ర, హోత్రి పాల్గొన్నారు.

గోదావరిఖని: నందమూరి తారకరత్నకు టీడీపీ నాయకులు ఆదివారం ఘన నివాళ్లర్పించారు. యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, కోటగిరి పాపయ్య, నిమ్మకాయలు ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంథనిలో మెగా జాబ్ మేళా



మంథని: పట్టణంలోని ఎస్‌ఎల్‌బీ గార్డెన్‌లో సోమవారం పుట్ట లింగమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి యాభై కంపెనీలతో ఇంటర్వ్యూలు నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు చేతుల మీదుగా జాబ్‌మేళాను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.